నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 3-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 1 | పేజీలు: 4 | వెల: రూ.1/-

తెలంగాణలో డేంజర్ బెల్స్.. మళ్లీ విజృంభిస్తున్న కరోనా

హైదరాబాద్ , ఆగష్టు 2తెలంగాణలో మళ్లీ కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. గాంధీలో కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం గాంధీలో400 మందికి చికిత్స కొనసాగుతోంది. గత రెండు వారాలుగా కొరోనా సివియార్టీ కేసుల సంఖ్య పెరుగుతుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

తెలంగాణలో ప్రతిరోజు వెయ్యి లోపు కేసులు నమోదు అవుతున్నాయి. అయితే, హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో కేసులు సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే రెండు డెల్టా ప్లస్ కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు కరోనాతో గాంధీ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

మరోవైపు తెలంగాణలో కరోనా అదుపులోనే ఉందని హెల్త్ డైరెక్ట్ శ్రీనివాసరావు తెలిపారు. అయితే, వైరస్ పూర్తిగా తగ్గలేదని స్పష్టం చేశారు. సెకండ్ వేవ్ ఇంకా కొనసాగుతూనే ఉందని ఇలాగే కొనసాగితే థర్డ్ వేవ్ వచ్చే ప్రమాదముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పండుగలు, సభలు, సమావేశాల్లో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

గాంధీలో సాధారణ సేవలు పెంచాలని చూస్తున్న తరుణంలో కేసుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తుంది. గాంధీ హాస్పిటల్‌లో నాన్ కోవిడ్ సేవలు ప్రారంభించడం కొంత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమేనని సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. ఆగస్టు 3 నుంచి నాన్ కోవిడ్ సేవలు ప్రారంభించడంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని రాజారావు వెల్లడించారు.

కృష్ణా జలాల వివాదం: మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని సూచించిన చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్ , ఆగష్టు 2కృష్ణా జలాల పంపకాలపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం వివాదం నెలకొన్న సంగతి తెలిసందే. కాగా ఈ వివాదంపై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా తెలంగాణ తరపు న్యాయవాది మాట్లాడుతూ? ఏపీ వేసిన పిటిషన్ పై విచారణ అవసరం లేదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గెజిట్ జారీ చేసిందని చెప్పారు. ఏపీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. అక్టోబర్ నుంచి గెజిట్ అమల్లోకి వస్తుందని గెజిట్ ను ఇప్పటి నుంచే అమలు చేయాలని, కొన్ని నెలల పాటు నీటిని నష్టపోకూడదనే తాము అడుగుతున్నామని అన్నారు.

ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. జల వివాదం అంశాన్ని రెండు రాష్ట్రాలు మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని సూచించారు. తాను ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలకు చెందిన వ్యక్తినని చెప్పారు. ఇక మధ్యవర్తిత్వానికి సంబంధించి తాము పూర్తిగా సహకరిస్తామని లేని పక్షంలో ఈ పిటిషన్ ను వేర్ బెంచ్ కు బదిలీ చేస్తామని చెప్పారు. ఇరువైపు న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి సమస్యను పరిష్కరించాలని తాను కోరుకుంటున్నానని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఈ వివాదంలో తాము అనవసరంగా జోక్యం చేసుకోదలుచుకోలేదని చెప్పారు. దీంతో, ఏపీ తరపున హాజరైన న్యాయవాది దుష్యంత్ దవే సమయం కావాలని కోరగా.. తదుపరి విచారణను సుప్రీంకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. మరోవైపు తెలంగాణ తరపున న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ కోర్టుకు హాజరయ్యారు.

నాగార్జున సాగర్ నియోజకవర్గానికి రూ. 150 కోట్లు : సీఎం కేసీఆర్

నల్లగొండ, ఆగష్టు 2: నాగార్జున సాగర్ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. సాగర్ ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతానని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. సాగర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 150 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధిపై హాలియా మార్కెట్‌యార్డులో సీఎం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. సాగర్ ఉప ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్నిచ్చి ముందుకు నడిపించినందుకు ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

కరోనా మహమ్మారి కారణంగా సాగర్‌కు రావడం ఆలస్యమైందన్నారు. తనను కూడా కరోనా విడిచిపెట్టలేదు. ఎన్నికలు అయిపోగానే ఇక్కడకు రాలేకపోయాను. సమస్యలు చాలా పెండింగ్‌లో ఉన్నాయి అని సీఎం తెలిపారు.

నోముల భగత్ అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సందర్భంలో ఆయా నియోజకవర్గాల టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వచ్చి పని చేశారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆ ఎమ్మెల్యేలు రిపోర్టు ఇచ్చారు. గ్రామాల్లో పొలాలకు వెళ్లేందుకు కూడా సరిగా కల్వర్టులు లేవని చెప్పారు. హాస్పిటళ్ల పరిస్థితి కూడా బాగాలేదని చెప్పారు. హాలియా పట్టణాన్ని చూస్తేనే తమ సమస్య అర్థమవుతుందని చెప్పారు. హాలియాను అద్భుతంగా చేయాలి. ఇక్కడ రోడ్లు సరిగా లేవు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. వాటన్నింటిని క్రమక్రమంగా పూర్తి చేసుకుందాం అని కేసీఆర్ అన్నారు.

నెల రోజుల్లో హక్కు పత్రాలు

నందికొండ మున్సిపాలిటీ క్వార్టర్స్‌తో పాటు ఇరిగేషన్ భూముల్లో ఉన్నవారిని క్రమబద్ధీకరిస్తాం. చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ ఆ ఇండ్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ, హక్కు పత్రాలు ఇవ్వాలని ఆదేశిస్తున్నాం. ఈ పని నెల రోజుల్లో పూర్తవుతుందన్నారు.

నందికొండ, హాలియా మున్సిపాలిటీలకు రూ. 15 కోట్ల చొప్పున నిధులు

నందికొండ, హాలియా మున్సిపాలిటీకి నిధులు కావాలని అడిగారు. హాలియాకు రూ. 15 కోట్లు, నందికొండ మున్సిపాలిటీకి రూ. 15 కోట్లు మంజూరు చేస్తున్నాం. ఈ మున్సిపాలిటీల అభివృద్ధికి మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలన్నారు.

ఇక సాగర్ నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేస్తున్నాం. సిబ్బంది, భవనం ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. మిని స్టేడియం కూడా మంజూరు చేస్తాం. ఆర్ అండ్ బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 120 కోట్లను మంజూరు చేస్తున్నాను. మొత్తంగా రూ. 150 కోట్లు మంజూరు చేస్తున్నాను అని తెలిపారు. రెడ్డి కల్యాణ మండపం కోసం గతంలో గుత్తా సుఖేందర్ రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో కొన్ని ఫండ్స్ మంజూరు చేశారు. ఆ కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తాం. షాదీఖానా కోసం కూడా స్థలం కేటాయిస్తాం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

మొత్తం 15 లిఫ్టులు

గుర్రం పోడు ప్రాంతంలో ఒక లిఫ్ట్ పెట్టినట్లు అయితే ఐదారు గ్రామాలకు కలిపి 10 వేల ఎకరాలకు నీరు వస్తుందని చెప్పారు. త్వరలోనే గుర్రంపోడు లిఫ్ట్ సర్వే చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇస్తాం. దీన్ని కూడా నెల్లికల్ లిఫ్ట్‌తో పాటు మంజూరు చేస్తామన్నారు. దేవరకొండలో ఐదు లిఫ్టులు మంజూరు చేశాం, మిర్యాలగూడలో ఐదు లిఫ్ట్‌లు, నకిరేకల్‌లో అయిటిపాముల వద్ద ఒక లిఫ్ట్‌తో పాటు ఈ జిల్లాకు మొత్తం 15 లిఫ్ట్‌లు మంజూరు చేయడం జరిగింది. లిఫ్ట్‌లన్నింటినీ రాబోయే ఒకటిన్నర సంవత్సరాల్లో పూర్తి చేసి జిల్లా ప్రజలకు అందిస్తామన్నారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తాం

రాష్ట్రంలో హాస్పిటల్స్ ఆశించిన స్థాయిలో లేవు అని సీఎం తెలిపారు. ఆరోగ్య శాఖ పనితీరును మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న 18 వేల బెడ్స్‌ను ఆక్సిజన్ సరఫరా చేసుకునే బెడ్స్‌గా మార్చుకున్నాం. ఏడు కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేసుకున్నాం. రాబోయే రోజుల్లో 33 జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి కాలేజీలో 500 బెడ్లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. హైదరాబాద్‌లో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తున్నాం. సూర్యాపేట, నల్లగొండలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకున్నాం. సాగర్‌లో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామని సీఎం ప్రకటించారు.

త్వరలోనే 57 ఏ0డ్ల వాళ్లందరికి కొత్త పెన్షన్లు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , ఆగష్టు 2 సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వృద్ధాప్య పెన్షన్లకు అర్హతను 57 ఏండ్లకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, అర్హులైన వాళ్లందరికి పెన్షన్లు అందిస్తామన్నారు. ఈ నిర్ణయంతో కొత్తగా మరో 6,62,000 మందికి ప్రతి నెలా రూ. 2016 వృద్ధాప్య పెన్షన్ అందనున్నదని మంత్రి తెలిపారు.

ఈ మేరకు తమ శాఖ అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 ఏ0డ్లు నిండిన అర్హత ఉన్న వాళ్లందరికి పెన్షన్లు ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. రైతుబంధు బీమా తరహాలోనే మరికొద్ది రోజుల్లోనే నేత, గీత కార్మికులకు కూడా బీమా ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటనను విడుదల చేశారు.

సీఎం చేతుల మీదుగా ఈ కొత్త పెన్షన్లు ప్రారంభిస్తామని ఆయన అన్నారు.

మిగతా హాస్పిటల్స్ తో పాటు, ఇప్పటికే మంజూరైన వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను కూడా మొదలు పెడతామన్నారు. గత 40 ఎండ్లుగా తన రాజకీయ జీవితంలో, ఇంత గొప్పగా పరిపాలన చేస్తున్న ప్రభుత్వాన్ని, సీఎంని తాను చూడలేదన్నారు.

ఎలక్ట్రానిక్ వోచర్.. ఈ-రూపీని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 2: డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు .. ఎలక్ట్రానిక్ వోచర్ ఈ-రూపీని ప్రధాని మోదీ ఇవాళ ఆవిష్కరించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఈరూపీ వోచర్‌ను రిలీజ్ చేశారు. డిజిటల్ లావాదేవీలు, నేరుగా నగదు బదిలీ విషయంలో దేశంలో ఈరూపీ కీలకపాత్ర పోషించనున్నట్లు మోదీ తెలిపారు. టార్గెట్ ప్రకారం.. చాలా పారదర్శకంగా.. ఎటువంటి లీకేజీ లేకుండా నగదును డెలివరీ చేయవచ్చు అని మోదీ అన్నారు. అత్యాధునిక టెక్నాలజీ సాయంతో 21వ శతాబ్దంలో ఇండియా ముందుకు వెళ్తున్న తీరుకు ఈ-రూపీని ఉదాహరణగా భావించవచ్చు అని ఆయన చెప్పారు. క్యూర్ కోడ్ లేదా ఎస్ఎంఎస్ రూపంలో ఈ వోచర్‌ను పంపిస్తారు. లబ్ధిదారుల మొబైల్‌కు ఆ వోచర్‌ను డెలివరీ చేస్తారు. దాని ద్వారా అమౌంట్‌ను వాడుకోవచ్చు.

పులిచింతల ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో.. 17 గేట్లు ఎత్తివేత

హైదరాబాద్ , ఆగష్టు 2ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణానది పరివాహక ప్రాజెక్టులన్నీ నిండటంతో వచ్చిన వరదను వచ్చినట్లు క్రస్టుగేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సూర్యాపేట-గుంటూరు జిల్లాల సరిహద్దులోని పులిచింతల జలాశయానికి వరద పొటెత్తుతున్నది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 3.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు 17 గేట్లు ఎత్తి 3 లక్షల 47వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 8వేల క్యూసెక్కులను కేటాయించారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా? ప్రస్తుతం 41.38 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటం, గేట్లు ఎత్తడంతో దిగువ ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. పులిచింతల క్రస్టుగేట్లు ఎత్తడంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరిగింది.

పెగాసస్ అంశంపై విచారణ చేపట్టాల్సిందే: నితీశ్ కుమార్

పాట్నా, ఆగష్టు 2: పెగాసస్ స్పైవేర్‌తో ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేసినట్లు వచ్చిన వార్తలపై బీహార్ సీఎం నితీశ్ కుమార్ స్పందించారు. రాజకీయవేత్తలు, జర్నలిస్టులు, జడ్జిల ఫోన్లను హ్యాక్ చేసిన అంశంలో విచారణ చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై నితీశ్ స్పందిస్తూ.. ప్రజలను వేధించేందుకు ఇలాంటి పనులు చేయవద్దు అని, అన్ని విషయాలను ప్రజలకు బహిర్గతం చేయాలని నితీశ్ డిమాండ్ చేశారు. పెగాసస్ వ్యవహారంపై చర్చ చేపట్టాలని పార్లమెంట్‌లోనూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పెగాసస్ అంశంపై విచారణ చేపట్టాలా అని అడిగిన ప్రశ్నకు.. అవును అని నితీశ్ బదులిచ్చారు. టెలిఫోన్ ట్యాపింగ్ గురించి చాలా రోజుల నుంచి చర్చలు సాగుతున్నాయని, పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తారని, అందుకే ఈ అంశంపై చర్చించాలని సీఎం నితీశ్ చెప్పారు. హ్యాకింగ్ అంశంపై గ్యారెంటీ లేదని, వీటిని ఎలా చేస్తారో ఎవరికీ తెలియదని, అందుకే అన్ని అంశాలను పరిశీలించాలని, దాని తర్వాతే చర్యలు చేపట్టాలని నితీశ్ తెలిపారు.

ములాయంతో లాలూ భేటీ

లక్నో, ఆగష్టు 2 వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికలకు కొత్త పొత్తులు తెరపైకి వస్తున్నాయి. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, ఆయన కుమారుడు అఖిలేష్ యాదవ్‌తో సోమవారం భేటీ కావడంతో ఇరు పార్టీల మధ్య పొత్తుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ములాయంను కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి వాకబు చేశానంటూ లాలూ ప్రసాద్ యాదవ్ తమ భేటీకి సంబంధించిన పలు ఫోటోలను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. రైతులు, పేదలు, నిరుద్యోగులు, అసమానత్వం వంటి పలు అంశాలపై తాము పరస్పరం తమ ఆలోచనలు పంచుకున్నామని చెప్పారు.

దేశానికి ఇప్పుడు మతతత్వం, క్యాపిటలిజం అవసరం లేదని సంక్షేమం, సమానత్వం అవసరమని భేటీ అనంతరం లాలూ వ్యాఖ్యానించారు. లాలూ, ములాయం భేటీలో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. కాగా చిన్న పార్టీలతో పొత్తులతో ముందుకెళతామని అఖిలేష్ పేర్కొన్న నేపథ్యంలో తాజా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసే ప్రతిపాదనతో గతనెలలో అఖిలేష్ యాదవ్ ఆప్ నేత సంజయ్ సింగ్‌తోనూ చర్చలు జరిపారు. కాగా యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధంగా ఉన్నామని ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని బీఎస్పీ ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

కృష్ణా జలాలపై ఏపీ దాదాగిరీ : సీఎం కేసీఆర్

నల్లగొండ, ఆగష్టు 2: కృష్ణా జలాల వివాదంపై నాగార్జున సాగర్ వేదికగా సీఎం కేసీఆర్ స్పందించారు. హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం, ఏపీ ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరిపై నిప్పులు చెరిగారు. కేంద్ర ప్రభుత్వం అవలంభించే తెలంగాణ వ్యతిరేక వైఖరి కావొచ్చు. ఆంధ్రా వాళ్లు చేస్తున్న దాదాగిరీ కావొచ్చు. కృష్ణా నదిపై ఏ విధంగా అక్రమ ప్రాజెక్టులు కడుతున్నారో ప్రజలందరూ చూస్తున్నారు. కృష్ణా నీళ్లలో రాబోయే రోజుల్లో మనకు ఇబ్బంది జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మనం జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దదేవులపల్లి చెరువు వరకు పాలేరు రిజర్వాయర్ నుంచి గోదావరి నీళ్లను తెచ్చి అనుసంధానం చేయాలనే సర్వే జరుగుతోంది. అది పూర్తయితే నాగార్జున సాగర్ ఆయకట్టు చాలా సేఫ్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. పెద్దదేవులపల్లి , పాలేరు రిజర్వాయర్ అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చరిత్రలో నేటినిజం



ఆగస్ట్, సెప్టెంబర్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం

న్యూఢిల్లీ, ఆగష్టు 2: ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం పేర్కొంది. ఉత్తర, మధ్య భారత్‌లోని పలు ప్రాంతాల్లో ఆగస్ట్‌లో సాధారణ వర్షపాతం, మరికొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర పేర్కొన్నారు.ఇక దేశవ్యాప్తంగా ఆగస్ట్, సెప్టెంబర్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా రుతుపవనాల నిష్క్రమణ తర్వాత మరోసారి ఎల్‌నినో ప్రభావం కనిపించవచ్చని ఐఎండీ అంచనా వేసింది.

సిరిధాన్యాలతోనే మధుమేహ సమస్యలు మాయం

('ఫ్రాంటీయర్స్ ఇన్ న్యూట్రీషన్' జర్నల్‌లో ప్రచురిత వ్యాసం ఆధారంగా)

సిరిధాన్యాలను (మిలెట్స్) ప్రధాన ఆహారంగా తీసుకుంటున్న ప్రజల్లో టేప్-2 మధుమేహ సమస్యలు తగ్గుతున్నాయని, మధుమేహం లేని వారిలో బ్లడ్ షుగర్ స్థాయి నియంత్రణచబడి ఆ రుగ్మత రాకుండా ముందు జాగ్రత్తలతో నిరోధించవచ్చని 'ఫ్రాంటీయర్స్ ఇన్ న్యూట్రీషన్' పరిశోధన పత్రికలో అచ్చయిన వ్యాసం వివరిస్తున్నది. యుకెకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్, యన్ఐయన్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్), ఇక్రిసాట్ (ఇంటర్నేషనల్ క్రాప్స్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమి-అరిడ్ ట్రోపిక్స్)లు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా ఫలితాలను తాజా పత్రిక ప్రచురితం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల్లో జరిపిన పరిశోధనల్లో మిలెట్స్‌ను ప్రధాన ఆహారంగా వాడడంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ 12-15 శాతం తగ్గుతూ, డయాబెటిస్ సమస్య లేకుండా పోతుందని తెలుస్తున్నది. సిరిధాన్యాలు తీసుకునే వారిలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) నియంత్రించబడుతూ, హిమోగ్లోబిన్‌ను అంటుకొని ఉండే బ్లడ్ గ్లూకోస్ (హెచ్‌బిఏ1సి) స్థాయి 17 శాతం వరకు పడిపోయి షుగర్ సమస్య దూరం అవుతుందని వివరించారు.

వ్యాసకర్తలు చేసిన పరిశోధనల్లో మిలెట్స్‌తో షుగర్ సంబంధ దాదాపు 80 ప్రచురిత వ్యాసాలను సవివరంగా సమీక్షించడంతో పాటుగా సిరిధాన్యాలను 'స్మార్ట్ ఫుడ్' జాబితాలో చేర్చాలని సలహా ఇచ్చారు. గతంలో పలు ప్రాంతాల్లో మిలెట్స్‌తో పాటు జొన్నలను కూడా తీసుకునే అలవాటు ఉండేది. బియ్యం, గోధుమలు, మొక్క జొన్నల ప్రాధాన్య పెరిగిన తరువాత సిరిధాన్యాల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. నేటి మధుమేహ సమస్యలతో విశ్వమానవాళి దృష్టి మిలెట్స్ వైపుకు మళ్ళడం, జిఐ తగ్గడంతో టైప్-2 డయాబెటిస్‌ను జయించడం హర్షదాయకం. ఇండియా, చైనా, యుయస్ దేశాల్లో మధుమేహ రుగ్మతలు అధికంగా ఉన్నాయి. ఆఫ్రికా దేశాల్లో 2019 నుంచి 2045 వరకు మధుమేహ సమస్య 143 శాతం, మిడిల్ ఈస్ట్ - నార్త్ అమెరికాలో 96 శాతం, సౌత్ ఈస్ట్ ఏరియాలో 74 శాతం పెరగవచ్చని అంచనా వేశారు. ఆఫ్రికా, ఆసియాల్లో మధుమేహ నియంత్రణకు ఏకైక సులభ మార్గం సిరిధాన్యాలను ప్రధాన ఆహారంగా వాడకమే అని తెలుస్తున్నది. మెలెట్స్‌లో జిఐ (గ్లైకమిక్ ఇండెక్స్) 52.7 ఉంటుందని, బియ్యం/గోధుమలతో పోల్చితే 36 శాతం, మొక్క జొన్నలతో పోల్చితే 14-37 జిఐ తక్కువగా ఉంటుందని తెలుస్తున్నది. మిలెట్స్‌ను ఉడికించిన తరువాత కూడా జిఐ విలువ బియ్యం/గోధుమలు/మక్కల కన్న తక్కువగానే ఉంటుందని వివరించారు. జిఐ విలువను బట్టి బ్లడ్ షుగర్ లెవల్స్ ఎంత వరకు, ఎంత తొందరగా పెరుగుతాయో తెలుస్తుంది. మధుమేహ అదుపుకు జీవనశైలి మార్పులు, తీసుకునే ఆహార పదార్థాల స్వభావం లాంటివి దోహదపడతాయి. ప్రపంచంలో నేడు 463 మిలియన్ల మధుమేహ రోగులు ఉన్నారని, 2045 నాటికి 700 మిలియన్లకు చేరవచ్చని అంచనా. ప్రపంచంలోని ప్రతి ఆరుగురు మధుమేహ రోగుల్లో ఒక్కరు భారతీయులు ఉంటారు. చైనాలో 116 మిలియన్లు, ఇండియాలో 77 మిలియన్లు, యుయస్‌లో 31 మిలియన్లు, పాకిస్థాన్‌లో 19 మిలియన్లు, బ్రెజిల్‌లో 17 మిలియన్లు, మెక్సికోలా 13 మిలియన్లు, ఇండోనేషియాలో 11 మిలియన్ల మధుమేహ రుగ్మతలు కలిగిన వారు ఉన్నారు. ప్రజలు మధుమేహ సమస్యతో సతమతమవుతున్నారు. ప్రపంచ దేశాల్లో ఒకవైపు పోషకాహారలోపం మరో వైపు అధిక పోషకాహార లభ్యత లాంటి సమస్యలు జీవనశైలి రుగ్మతలకు కారణం అవుతున్నాయి. పోషకాహారలోపం, ప్రపంచ ఆరోగ్య సంక్షోభం, ప్రకృతి వనరుల విచ్ఛిన్నం, వాతావరణ మార్పులకు సమాధానంగా సిరిధాన్యాల వాడకం ఉపయోగపడుతుందని అభిప్రాయ పడుతున్నారు. గత ఐదు ఏండ్లుగా ఇక్రిశాట్ నిర్వహించిన 'స్మార్ట్ ఫుడ్ ఇనిషియేటివ్-2021' అధ్యయనాల్లో సిరిధాన్యాల వాడకంతో మధుమేహమే కాకుండా రక్తహీనత, ఐరన్ పోషక అవసరం, కొలెస్టరాల్, కార్డియోవాస్క్యూలార్ వ్యాధులు, కాల్షియం/జింక్ ధాతు లోపాలపై మెటా-విశ్లేషణలు చేయడం సంతోషదాయకం. మనకు అందుబాటులో ఉన్న 11 రకాల మిలెట్స్‌లో జిఐ 55 నుంచి 69 వరకు ఉండడం గమనించబడింది. ఆరోగ్య ఆహారంగా సిరిధాన్యాలను స్మార్ట్-ఫుడ్‌గా గుర్తించి, బియ్యం/గోధుమలు/మక్కల వాడకాన్ని తగ్గించి, జీవనశైలి మార్పులను ఒంటపట్టించుకొని మధుమేహం లేని మానవ సమాజాన్ని నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

నైపుణ్యాభివృద్ధితో యువత భవిష్యత్తుకు రాచబాట: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 2:భారతీయ యువతలో సహజంగానే అపారమైన ప్రతిభాపాటవాలున్నాయని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆ సామర్థ్యానికి పదునుపెట్టుకుని సద్వినియోగ పరుచుకోవాలని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా తమ బంగారు భవితకు యువత బాటలు వేసుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

ఆదివారం హైదరాబాద్ విమానాశ్రయం సమీపంలోని జీఎంఆర్-వరలక్ష్మీ ఫౌండేషన్, జీఎంఆర్-చిన్మయ విద్యాలయ లను ఉపరాష్ట్రపతి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. యువత అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతోపాటు కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఇప్పుడు శ్రమించి సొంతకాళ్లపై నిలబడితేనే భవిష్యత్తు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

జీఎంఆర్-చిన్మయ విద్యాలయ విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదువుకోవాలని, విద్యతోపాటు శారీరక శ్రమను కూడా చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు.

జీఎంఆర్ సంస్థ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలనూ ఉపరాష్ట్రపతి అభినందించారు. జీవితంలో ఎంత సంపాదించినప్పటికీ, సంపాదించిన దాన్ని తోటి సమాజంతో పంచుకోవాలనే ఆలోచన చాలా గొప్పదన్నారు. ఉదారవాదంతో సేవాకార్యక్రమాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న జీఎంఆర్ సంస్థ చైర్మన్ శ్రీ గ్రంథి మల్లికార్జునరావు గారిని ఉపరాష్ట్రపతి అభినందించారు.

'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న్ యోజన' కు చెందిన గుజరాత్ లబ్ధిదారులతో నేడు సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 2:గుజరాత్ లోని 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న్ యోజన' లబ్ధిదారుల తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021వ సంవత్సరం ఆగస్టు 3 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల కు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా సమావేశం కానున్నారు.

ఈ పథకం గురించి ఆ రాష్ట్రం లో అవగాహన ను పెంచేందుకు ప్రజా భాగస్వామ్యం కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరుగుతోంది.

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న్ యోజన (పిఎంజికెఎవై) ని గురించి:

పిఎంజికెఎవై అనేది ఒక ఆహార భద్రత సంక్షేమ సంబంధి కార్యక్రమం. కోవిడ్ -19 తాలూకు ఆర్థిక ప్రభావాన్ని తగ్గించడం లో సాయపడుతూ, తోడ్పాటు ను అందించేందుకు ప్రధాన మంత్రి ఆలోచనల లో నుంచి రూపుదిద్దుకొన్న కార్యక్రమం ఇది. పిఎంజికెఎవై లో భాగం గా, జాతీయ ఆహార భద్రత చట్టం పరిధి లో లబ్ధిదారుల కు అందరికీ ప్రతి ఒక్కరికీ 5 కిలో ల అదనపు ఆహార ధాన్యాల ను ఇవ్వడం జరుగుతుంది.

ఈ సందర్భం లో గుజరాత్ ముఖ్యమంత్రి, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి కూడా పాల్గొంటారు.

జూలైలో స్థూల జీఎస్టీ రెవిన్యూ వసూళ్లు రూ. 1,16,393 కోట్లు

న్యూఢిల్లీ, ఆగష్టు 2:జూలై 2021 నెలలో సేకరించిన స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,16,393 కోట్లు, ఇందులో సీజీఎస్టీ రూ.22,197 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.28,541 కోట్లు, ఐజీఎస్టీ రూ.57,864 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.27,900 కోట్లు సహా), సెస్ రూ.7,790 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.815 కోట్లతో సహా). ఈ వివరాలు 2021 జూలై 1 నుండి జూలై 31 వరకు దాఖలు చేసిన జిఎస్‌టిఆర్ -3 బి రిటర్నుల నుండి వసూలైన జీఎస్టీతో పాటు అదే సమయంలో దిగుమతుల నుండి సేకరించిన ఐజిఎస్‌టి, సెస్ వసూళ్లు కూడా ఉన్నాయి.

జులై 1 నుండి 5వ తేదీ వరకు దాఖలైన రూ 4,937 కోట్ల రిటర్న్‌ల ద్వారా వసూలు అయిన జిఎస్‌టి కూడా 2021 జూన్ జిఎస్‌టి లెక్కలో చేర్చడం జరిగింది. పన్ను చెల్లింపుదారులకు మినహాయింపు/వడ్డీ తగ్గింపు రూపంలో వివిధ ఉపశమన చర్యలు అందించబడ్డాయి. కోవిడ్ మహమ్మారి రెండవ వేవ్ నేపథ్యంలో రూ. 5 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న చెల్లింపుదారులకు రిటర్న్ ఫైలింగ్ నెల జూన్ 21 కోసం 15 రోజుల పాటు రిటర్న్ దాఖలులో జాప్యం జరిగినా వడ్డీలో రాయితీ ఇస్తున్నారు.

ప్రభుత్వం ఐజిఎస్‌టి నుండి సీజిఎస్‌టికి రూ.28,087 కోట్లు, ఎస్జిఎస్‌టి కి రూ.24100 కోట్లు రెగ్యులర్ సెటిల్‌మెంట్‌గా సెటిల్ చేసింది. జూలై 2021 నెలలో రెగ్యులర్ సెటిల్మెంట్ తర్వాత కేంద్రం మరియు రాష్ట్రాల మొత్తం ఆదాయం సీజిఎస్‌టి నుండి రూ.50284 కోట్లు మరియు ఎస్జిఎస్‌టి నుండి రూ.52641 కోట్లు ఉంది.

2021 జూలై నెల ఆదాయాలు గత సంవత్సరం ఇదే నెలలో జీఎస్టీ ఆదాయాల కంటే 33% ఎక్కువ. ఈ నెలలో, వస్తువుల దిగుమతి ద్వారా వచ్చే ఆదాయాలు 36% ఎక్కువగా ఉన్నాయి, అలాగే దేశీయ లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయం (సేవల దిగుమతితో సహా) గత సంవత్సరం ఇదే నెలలో ఈ వనరుల నుండి వచ్చిన ఆదాయాల కంటే 32% ఎక్కువరూ. పైన పోస్ట్ చేసిన తర్వాత ఊహించిన సేకరణ. వరుసగా ఎనిమిది నెలలకు 1 లక్ష కోట్ల రూపాయల చొప్పున ఉన్న జీఎస్టీ, జూన్ 2021 లో 1 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. కారణం, 2021 మే నెలలో చాలా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు కోవిడ్ కారణంగా పూర్తి లేదా పాక్షిక లాక్ డౌన్‌లో ఉన్నాయి.కోవిడ్ ఆంక్షలను సడలించడంతో, జూలై 2021 జిఎస్‌టి సేకరణ మళ్లీ రూ.1 లక్ష కోట్లు దాటింది, ఇది ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన స్థితిలో కోలుకుంటోందని స్పష్టంగా సూచిస్తుంది. రాబోయే నెలల్లో కూడా బలమైన జిఎస్‌టి ఆదాయాలు కొనసాగే అవకాశం ఉంది

యూపీలో 16 నుంచి కాలేజీలు ఓపెన్

న్యూఢిల్లీ, ఆగష్టు 2:స్కూళ్లు, కాలేజీలను తెరిచేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సంసిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుంచి 12వ తరగతి క్లాసులను తెరిచేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కాలేజీలు, యూనివర్సిటీలను సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి తెరవనున్నట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఇంటర్ కాలేజీలను 50 శాతం కెపాసిటీతో ఓపెన్ చేసేందుకు పర్మిషన్ ఇచ్చారు. కాలేజీలు, వర్సిటీల్లో ఆగస్టు 5వ తేదీ నుంచి విద్యార్థుల ప్రవేశ ప్రక్రియ మొదలుపెట్టే విధంగా ఆదేశాలు ఇచ్చారు. కోవిడ్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్ అయిన విషయం తెలిసిందే. ఇప్పటికే హిమాచల్, పంజాబ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఇంటర్ కాలేజీలను ఓపెన్ చేశారు.

సామాజిక సాధికారత శిబిరంలో దివ్యాంగులకు ఏడీఐపీ పథకం కింద పరికరాలు మరియు సహాయక పరికరాలు అందజేత

న్యూఢిల్లీ, ఆగష్టు 2:రాష్ట్రీయ వయోశ్రీ యోజన కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న ఏడీఐపీ పథకం కింద దివ్యాంగులు,సీనియర్ సిటిజన్లకు అవసరమైన సహాయ పరికరాలు, సహాయాన్ని అందించడానికి అలిమ్కో, ఔరంగాబాద్ (బీహార్) జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ రోజు కేంద్ర సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ సామాజిక సాధికారత శిబిరాన్ని నిర్వహించింది.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖల మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ శిబిరాన్నిన్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖల సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమా భౌమిక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత సహాయ మంత్రి శ్రీ ఎ. నారాయణస్వామి కూడా హాజరయ్యారు . ఔరంగాబాద్ లో జరిగిన ప్రధాన కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు శ్రీ సుశీల్ కుమార్ సింగ్ హాజరయ్యారు. అయితే కరాకట్ పార్లమెంటు సభ్యుడు శ్రీ మహాబలి సింగ్ ఇతర ప్రముఖులు వర్చువల్ విధానంలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ శిబిరంలో 5102 సహాయ సామాగ్రిని మరియు 2.43 కోట్ల రూపాయల విలువ చేసే సహాయక పరికరాలు 1521 దివ్యాంగులకు మరియు 546 సీనియర్ సిటిజన్లకు బ్లాక్/పంచాయితీ స్థాయిలలో ఉచితంగా అందజేశారు. కోవిడ్-19 ని దృష్టిలో ఉంచుకుని శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం శిబిరాన్ని నిర్వహించారు.

సమావేశంలో ప్రసంగించిన శ్రీ వీరేంద్ర సింగ్ ఇటువంటి శిబిరాలను నిర్వహించడం వల్ల ప్రభుత్వ ప్రయోజనాలు నేరుగా అర్హులైన లబ్దిదారులకు చేరుతాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కలుగుతుందని అన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను మంత్రి వివరించారు. 2014 లో ప్రారంభమైన కోక్లియర్ ఇంప్లాంటేషన్ పథకం కింద వినికిడి లోపం ఉన్న 3555 మంది పిల్లలకు పరికరాలను అందించామని అన్నారు. బీహార్ రాష్ట్రంలో 50 కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు నిర్వహించారని చెప్పారు. బీహార్‌లో ప్రభుత్వ పథకం కింద ఇటువంటి శస్త్రచికిత్సలు నిర్వహించడం కోసం ఏడు ఆసుపత్రులను గుర్తించామని తెలిపారు. బీహార్ రాష్ట్రంలో 5855 దివ్యాంగ విద్యార్థులకు 22.83 కోట్ల రూపాయలను స్కాలర్‌షిప్ విడుదల చేసారు. బీహార్‌లోని 21 ప్రభుత్వ భవనాలను దివ్యాంగులకు అందుబాటులోకి తీసుకురావడానికి సుగమ్య భారత్ అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం 9.25 కోట్ల రూపాయలను విడుదల చేసింది.

దేశంలో దివ్యాంగ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ ఇవ్వడానికి మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో కేంద్రం 171 కోట్ల రూపాయల ఖర్చుతో వికలాంగ క్రీడల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఇంతేకాకుండా బీహార్ రాష్ట్రంలో 59 లక్షల గుర్తింపు కార్డులు మంజూరు చేసింది. వీటిలో బీహార్ రాష్ట్రంలో 1.39 లక్షల కార్డులను అందించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గత ఏడు సంవత్సరాల కాలంలో పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు వచ్చాయని మంత్రి అన్నారు. గత ఏడు సంవత్సరాలలో మరియు ప్రస్తుత సంవత్సరంలో 20.01 లక్షల మంది దివ్యాంగులకు 10428 క్యాంపుల ద్వారా 1210.67 కోట్ల రూపాయల విలువ చేసే సహాయాలు మరియు సహాయక పరికరాలను అందించామని మంత్రి తెలిపారు. ఏడీఐపీ పథకం కింద మంత్రిత్వ శాఖ నిర్వహించిన పంపిణీ శిబిరాల నిర్వహణలో 10 గిన్నిస్ ప్రపంచ రికార్డులను సృష్టించామని అన్నారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ సహాయ మంత్రి సుశ్రీ ప్రతిమా భూమిక్ దివ్యాంగులకు సాధికారత కల్పించడానికి నైపుణ్య శిక్షణా కార్యక్రమంపై దృష్టి సారించాలని సూచించారు. దేశ సమగ్ర అభివృద్ధికి దివ్యాంగులను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావాలని అన్నారు . దివ్యాంగుల సంక్షేమానికి తమ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్న మంత్రి దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన అన్ని రకాల సహాయాలను అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. వికలాంగుల సాధికారతపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని ఆమె అన్నారు. సీనియర్ సిటిజన్లను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని అన్నారు. వీరి సంక్షేమానికి అన్ని చర్యలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

దివ్యాంగులు మరియు సీనియర్ సిటిజన్ల సాధికారత కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కేంద్ర మంత్రికి శ్రీ మహాబలి సింగ్ కరతాత్ పార్లమెంటు సభ్యుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఔరంగాబాద్ పార్లమెంటు సభ్యుడు శ్రీ సుశీల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల వికలాంగులకు మరియు సీనియర్లకు ప్రయోజనం కలుగుతున్నదని అన్నారు.

సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను శాఖ కార్యదర్శి శ్రీమతి. అంజలి భ్రావివరించారు. దివ్యాంగులు మానవ వనరులలో అంతర్భాగమని, దివ్యాంగులకు సమాజంలో ప్రధాన స్రవంతిని తీసుకువచ్చే ందుకు అన్ని విధాలా సమర్థవంతమైన వాతావరణాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు.

సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డా. ప్రబోధ్ సేథ్ స్వాగతం పలికారు.

కోవిడ్ 19 దృష్ట్యా, గుర్తించబడిన లబ్ధిదారులకు వారి నిర్దేశిత సహాయక పరికరాలను వారి సమీపంలోని వారి బ్లాక్స్ వద్ద ఔరంగాబాద్, జిల్లాలోని తదుపరి పంపిణీ శిబిరాలలో అందిస్తారు.

బ్లాక్ స్థాయిలో గుర్తించిన లబ్ధిదారులకు 1062 ట్రైసైకిల్, 385 వీల్‌చైర్లు, 936 క్రచెస్, 417 వాకింగ్ స్టిక్స్, 43 రోలేటర్లు, 07 స్మార్ట్ ఫోన్, 40 స్మార్ట్ కేన్, 8 బ్రెయిలీ కిట్, 06 సి పి చైర్, 10 ఎడిఎల్ కిట్, 06 సెల్ ఫోన్, 873 హియరింగ్ ఎయిడ్, 332 కృత్రిమ అవయవాలు మరియు కాలిపర్స్, 505 టెట్రాపోడ్, 02 వాకర్, 62 కళ్లజోళ్లు, 392 డెంచర్లు మొదలైనవి అందజేయడం జరిగింది. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు రోజువారీ జీవన విధానంలో సహాయ పడే ఉపకరణాలు మరియు ఉపకరణాలను అందించడానికి అంగవైకల్యం కలిగిన వ్యక్తుల సహాయ పథకం ఈ శిబిరాలు నిర్వహిస్తారు.ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఈ శిబిరాలు నిర్వహించబడుతున్నాయి. సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు/జిల్లాల అధికారులతో కలిసి పథకాన్ని అమలు చేస్తున్నది. కోవిడ్ -19ని దృష్టిలో ఉంచుకుని సామాజిక దూరం మరియు పరిశుభ్రత ప్రోటోకాల్‌లకు అనుగుణంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. .అలిమ్కో సిఎండి శ్రీ డి ఆర్ సరిన్, ఔరంగాబాద్ కలెక్టర్ శ్రీ సౌరవ్ సుమన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగస్టులోనే థర్డ్ వేవ్ ముప్పు..?

న్యూఢిల్లీ, ఆగష్టు 2::ఇండియాలో కరోనా కేసులు స్వల్ప విరామం తీసుకుని మళ్లీ విజృంభిస్తున్నాయి. రోజు రోజుకు కేసుల సంఖ్య చాప కింద నీరులా పెరుగుతున్నాయి. దీంతో థర్డ్ వేవ్ పై అంచనాలు అందరి మదిలో మెదులుతున్నాయి. కరోనా థర్డ్ వేవ్ ఆగస్టు నెలలో ప్రారంభమై సెప్టెంబర్ లో పీక్స్ కు చేరుతుంది అన్న నిపుణుల అంచనా నిజమవుతుందా అన్న ఆందోళన ప్రస్తుతం అందరినీ వేధిస్తుంది. ఇక కేరళ, మహారాష్ట్రతో పాటుగా ఈశాన్య రాష్ట్రాల్లో కేసులు పెరుగుతుండటంతో థర్డ్ వేవ్ ముప్పు పొంచి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా కరోనా కేసులు పెరుగుతున్న తీరు, ఆసుపత్రుల్లో పెరుగుతున్న చేరికలు ఆందోళనకరంగా మారాయి. అధికారిక లెక్కల కంటే అనధికారికంగా చాలామంది కరోనా బారిన పడుతున్నట్టు ఆసుపత్రుల్లో పెరుగుతున్న రద్దీ స్పష్టం చేస్తుంది. ఇక భారత్‌లో కరోనా థర్డ్ వేవ్ తప్పకవస్తుందనీ? ఎప్పుడు వస్తుందో కచ్చితంగా చెప్పలేమని సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ మండలి (ఆూఎఖీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ అన్నారు. వ్యాక్సిన్, సేఫ్ డిస్టాన్స్, మాస్క్ మాత్రమే ప్రజలను కాపాడతాయని చెప్పారు. కేరళలో రోజూ 20వేలకు పైగా కేసులు వస్తుండటంపై రీసెర్చ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇండియాలో మళ్లీ డెల్టా వేరియంట్ విరుచుకుపడే ప్రమాదం ఉందన్నారు.

కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే కేంద్రం అప్రమత్తం చేసింది. కొన్ని సర్వేలు అక్టోబర్ నెలలో థర్డ్ వేవ్ ముప్పు ఉంటుందని గతంలో నిపుణులు పేర్కొన్నప్పటికి.. థర్డ్ వేవ్ ఈ నెలలోనే ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొదటి, రెండో వేవ్‌ల మధ్య వచ్చిన గ్యాప్, తీవ్రత, కేసుల పెరుగుదల ఆధారంగా థర్డ్ వేవ్‌ను అంచనా వేస్తున్నారు. సెకండ్ వేవ్‌కు కారణమైన డెల్టావేరియంట్, థర్డ్ వేవ్‌కు కూడా కారణం అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం డెల్టావేరియంట్ అమెరికా, జపాన్, మలేషియా, ఇరాన్‌తో పాటుగా ప్రపంచంలోని 130 దేశాల్లో వ్యాపించింది. ఈ వేరియంట్ వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో ప్రపంచంలోని అన్ని దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

ఇక ఏపీలో జూలై 20వ తేదీ నుంచి రోజుకు సగటున 594 మంది ఆసుపత్రులలో చేరుతున్నారు అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జూలై 2వ తేదీ నుండి 11వ తేదీ మధ్య సగటున 197 మంది ఆస్పత్రిలో చేరగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సుమారు 600 వరకు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కరోనా థర్డ్ వేవ్ ముంచుకొస్తుంది అని ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటుగా కేంద్రం పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్న పరిస్థితులు నిత్యం చూస్తూనే ఉన్నాం.

ఇక తెలంగాణలోనూ పరిస్థితి ఇంచుమించు అదేవిధంగా ఉంది. మళ్లీ కరోనా ఆసుపత్రులలో చేరికలు క్రమంగా పెరుగుతున్నాయి. హైదరాబాద్లో ఆసుపత్రులలో కరోనా కేసుల రద్దీ పెరుగుతోంది అయినప్పటికీ ఇవి బయటకు రాకుండా, అధికారిక లెక్కలలో తక్కువ కేసులు నమోదైనట్లుగా చూపిస్తున్నట్లుగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కరోనా కట్టడికి పెద్దగా చర్యలు తీసుకోవటం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఏది ఏమైనా ముప్పు ముంగిట్లో మనం ఉన్నట్లుగా ప్రస్తుతం పెరుగుతున్న కేసుల తీరు స్పష్టంగా చెబుతోంది. ఈ సమయంలో కూడా అప్రమత్తంగా లేకుంటే సెకండ్ వేవ్ ను మించి థర్డ్ వేవ్ విధ్వంసం సృష్టించే ప్రమాదం లేకపోలేదు. కాబట్టి తస్మాత్ జాగ్రత్త . మాస్కులు ధరించటం , సామాజిక దూర నిబంధనలు పాటించటంతో పాటు వ్యాక్సినేషన్ చేయించుకోవటం తప్పనిసరి అని నిపుణుల సూచనలు పాటిద్దాం.

రాజకీయ ఉనికి కోసమే ప్రతిపక్షాల విమర్శలు : ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, ఆగష్టు 2: రాజకీయ ఉనికి కోసమే ప్రతిపక్షాల విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అపహాస్యం చేస్తే ప్రజలలో చులకనవుతారని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలనే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల కోసం ఏ పథకాన్ని ప్రవేశ పెట్ట లేదని ఆయన గుర్తు చేశారు. అలాగే ఏ పథకాన్ని కూడా అర్ధాంతరంగా నిలిపి వేయలేదనే విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు గమనించాలన్నారు. రైతు

ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ, చౌకబారు, అనాలోచితమైన విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 57 సంవత్సరాలకు పెన్షన్ వర్తింపు అమలు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం 27 మంది లబ్ధిదారులకు 10 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.

కౌషిక్ రెడ్డికి ఎమ్మెల్సీ.. హుజురాబాద్‌లో సంబురాలు

కరీంనగర్ ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ నాయకుడు పాడి కౌషిక్ రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో టీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాలుస్తూ, స్వీట్లు పంచి పెడుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. కౌషిక్ రెడ్డిని ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన మరింత కృషి చేసే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గం ప్రజల తరపున టీఆర్ఎస్ శ్రేణులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జూరాల, శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

హైదరాబాద్ , ఆగష్టు 2 కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రియదర్శిని డ్యామ్‌కు ప్రస్తుతం 3,97,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి ఔట్ ఫ్లో 3,85,527 క్యూసెక్కులుగా ఉన్నది. 36 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ 9.657 టీఎంసీలకు ప్రస్తుతం 6.822 టీఎంసీల నిల్వ ఉన్నది. మరో వైపు శ్రీశైలం జలాశయానికి 4,41,914 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు నుంచి 4,35,525 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉన్నది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.80 అడుగుల మేర నీరుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. డ్యామ్‌లో ప్రస్తుతం 208.7210 టీఎంసీలు నిల్వ ఉన్నది. డ్యామ్ పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

దళిత బంధుపై బీజేపీ తప్పుడు ప్రచారం

కరీంనగర్, ఆగష్టు 2దళిత బంధు పథకం మీద బీజేపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ అన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడారు. దళితులకు ఏం చేద్దామని నాలుగు సంవత్సరాల క్రితమే సీఎం కేసీఆర్ నన్ను అడిగిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఆత్మహత్యలు, చేనేత ఆత్మహత్యలు, ఎన్ కౌంటర్లు ఉన్న తెలంగాణ ఈ రోజు ప్రగతి పథంలో దూసుకెళుతందన్నారు.

జీఎహెచ్ ఎంసీ ఎన్నికల్లో బండి పోతే బండి, కారు పోతే కారు అన్నరు ఏమైందని బీజేపీ నేతలను ప్రశ్నించారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి ఎంపీగా గెలిచింది బండి సంజయ్ మాత్రమే అన్నారు. నటలో బండి సంజయ్‌కు ఆస్కార్ ఆవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. బీజేపీ డ్రామాలు మొదలు పెట్టిందని విమర్శించారు. ఈటల అస్వస్థతకు గురవడాన్ని ప్రజలు ఎట్ల నమ్ముతరని ప్రశ్నించారు.

దళిత బంధును ఆపేందుకు కోర్టుకు వెళ్లారు. దళితులను బానిసలుగా చూసిన వ్యక్తి ఈటల రాజేందర్ అని మండిపడ్డారు. ఎవరు అడ్డుకున్న దళిత బంధు ఆగదు. బల్ల గుద్ది చెప్తున్న దళిత బంధు కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ప్రగతి భవన్ పేల్చుతామని బండి సంజయ్ పిచ్చి లేసి మాట్లాడుతున్నడు.

కోటి ఉద్యోగాలు, రూ.15లక్షలు అకౌంట్‌లో వేశారా? ముందు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని బీజేపీ నాయకులను నిలదీశారు. క్యూ న్యూస్ మల్లన్నను తీసుకు వెళ్లి పిచ్చి హాస్పిటల్‌లో వెయ్యాలన్నారు. ఈటల తన అల్లుడి కాళ్లు కూడా కడుగలేదు. కానీ దళితులతో కాళ్లు కడిగిచ్చుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

వరంగల్ అర్బన్, ఆగష్టు 2 ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న ఇద్దరు చైన్ స్నాచర్లను వేలేరు పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన చైన్ స్నాచర్ల నుంచి సుమారు 6 లక్షల రూపాయల విలువగల 75 గ్రాముల మూడు బంగారు పుస్తెల తాడులతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి మీడియాకు వివరాలను వెల్లడించారు. పుల్లూరి రాజేష్, బత్తుల రాజు నిందితులు ఇద్దరు ఒకే కళాశాలో డిగ్రీ కల్సి చదవడం ద్వారా ఇద్దరి మధ్య స్నేహం కుదరిందన్నారు. వీరిలో ఎంబీఏ చేసిన రాజేష్ పాన్‌షాపు నిర్వహిస్తుండగా, మరో నిందితుడు మెడికల్ రిప్రజెంటివ్ పనిచేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడ్డ వీరు అదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళికను రూపొందించుకున్నారు. ఇందుకోసం ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకొని మహిళల మెడలోని బంగారు గోలుసులను చోరీ చేసేందుకు సిద్ధపడ్డారు. ధర్మసాగర్ ఇన్ స్పెక్టర్ అదేశాల మేరకు వేలేరు ఎస్.ఐ వెంకటేశ్వర్లు, ప్రొబేషనరీ ఎస్.ఐ హఫీజా తమ సిబ్బందితో కలిసి వేలేరు పీచర క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. నిందితులు తనీఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు.

పోలీసులు వెంబడించి పట్టుకొని తనీఖీ చేయగా నిందితుల వద్ద మూడు బంగారు పుస్తెల తాళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీపీ తెలిపారు. నిందితులు పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను అభినందించారు.

దళితబంధు భద్రతకు ప్రత్యేక చట్టం.. ఈ నెల 16 నుంచి అమలు

హైదరాబాద్ , ఆగష్టు 2దళితులకు ఆర్థిక సాధికారత, స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం ఈ నెల 16 నుంచి అమలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసింది. దళితులను పెట్టుబడిదారులుగా అభివృద్ధి చేయడం కోసం ప్రతి జిల్లాలో 'సెంటర్ ఫర్ దళిత్ ఎంటర్‌ప్రైజ్' ఏర్పాటు చేయాలని తీర్మానించింది. అందుకు పూర్తిస్థాయిలో అధికారయంత్రాంగం సిద్ధం కావాలని ఆదేశించింది. పథకం అమలు, విధి విధానాల రూపకల్పనపై రాష్ట్రమంత్రివర్గం విస్తృ?తంగా చర్చించింది. పథకం పూర్వాపరాలను సీఎం కేసీఆర్ మంత్రివర్గ సహచరులకు విశదీకరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ఫలితాలు ప్రజల అనుభవంలో ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. దళితబంధు పథకానికి చట్టభద్రత కల్పిస్తూ ఒక ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేబినెట్ అభిప్రాయపడింది. గతంలో ఎస్సీ ప్రగతి నిధి చట్టం తెచ్చి, ఒక బడ్జెట్‌లో దళితులకు కేటాయించిన నిధులలో మిగిలిన నిధులను తర్వాతి బడ్జెట్‌కు బదలాయించే విధానం తీసుకొచ్చామని, ఆ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, అదేవిధంగా దళితబంధు కూడా దేశానికి దారి చూపే పథకం అవుతుందని మంత్రివర్గం అభిప్రాయపడిందిఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం అధ్యక్షతన ఆరు గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రజాసంక్షేమానికి సంబంధించిన అనేక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకొన్నారు. దళిత బంధు అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిన వెంటనే షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఈ పథకం కోసం రూ.250 కోట్లను విడుదలచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కరోనా కారణంగా తల్లిదండ్రులు చనిపోయి ఆనాథలైన పిల్లలను

పూర్తిస్థాయిలో సంరక్షించుకోవాలనే అంశంతో మంత్రివర్గ సమావేశం మొదలైంది. తర్వాత రైతులకు రూ.50 వేల రుణమాఫీ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకొన్నది. తెలంగాణ పత్తికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో పత్తి పంట సాగును మరింత పెంచాలని తీర్మానించింది. వృద్ధాప్య పెన్షన్ వయోపరిమితిని 57 ఏండ్లకు కుదిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నది. ధోబీఘాట్లు, సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాను వారంలోగా సంపూర్ణంగా అమలుచేయాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది.

మెడికల్ హబ్‌గా మారనున్న మహబూబ్‌నగర్ : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 2: భవిష్యత్‌లో మహబూబ్‌నగర్ మెడికల్ హబ్‌గా మారనుందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ స్థలం పత్రాలను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం కోసం వైద్య శాఖకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు ఇవాళ మంచిరోజు అన్నారు.

సమైక్య రాష్ట్రంలో సరైన వైద్యం అందక హైదరాబాద్ తీసుకెళ్తుంటే మధ్యలోనే చనిపోయేవారు.

కలెక్టరేట్‌ను దవాఖానగా మారుద్దామని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త కలెక్టరేట్ కు మారిన తరువాత ఇక్కడ పని ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. 300 కోట్ల రూపాయలతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లు పిలుస్తాం.

ఆర్టీసీ బస్ స్టాండ్‌కు ఎదురుగా..ఇంత పెద్ద స్థలం పేద ప్రజల ఆరోగ్యం

కాపాడుకునేందుకు దవాఖానను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అడగగానే హాస్పిటల్ ఏర్పాటకు అంగీకరించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆక్సిజన్ జనరేషన్ ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి, ఆగష్టు 2: భూపాలపల్లి సింగరేణి ఏరియా దవాఖాన వద్ద రూ రూ. 46 లక్షల వ్యయంతో సింగరేణి సంస్థ నిర్మించిన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంటును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆక్సిజన్ జనరేషన్ ప్లాంటును ప్రారంభించడం శుభపరిణామమన్నారు. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భూపాల్ పల్లి ఏరియాలో కార్మికుల సౌకర్యార్థం 994 డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టామన్నారు. భూపాలపల్లిలో మార్కెట్ నెలకొల్పేందుకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయించారన్నారు. అదేవిధంగా మరో రెండు కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

మెడికల్ కాలేజీలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు రిజర్వేషన్ విధానం అమలు చేసే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. అనంతరం సింగరేణి డైరెక్టర్లు బలరాం చంద్రశేఖర్, సత్యనారాయణ మాట్లాడుతూ.. సింగరేణిలో కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి

సింగరేణి సీఎండీ శ్రీధర్ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఎంత ఖర్చు అయినా వెనకాడకుండా సింగరేణి ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష సమావేశం

హైదరాబాద్ , ఆగష్టు 2 మొహర్రం ఏర్పాట్లపై రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ లో గల డీఎస్ఎస్ భవన్‌లో ఆదివారం ఈ సమీక్షా సమావేశాన్ని జరిగింది. సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి కారణంగా గత సంవత్సరం మొహర్రం వేడుకలకు అనుమతి లేదన్నారు. ఈవెంట్‌లు పరిమిత పద్ధతిలో ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏనుగు ఊరేగింపుల ఏర్పాట్లు చేయబడలేదన్నారు. ఏదేమైనా ఈ సంవత్సరం ఎటువంటి ఆంక్షలు లేవన్నారు. కాబట్టి ఈ సంవత్సరం సంప్రదాయం

ప్రకారం మొహర్రం వేడుక జరుగుతుందని వెల్లడించారు.

మొహర్రం వేడుకలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని షియా సంస్థల ప్రతినిధులకు మంత్రులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ పోలీసు, ఆరోగ్యం, వైద్యం, అగ్నిమాపక సేవలు, నీరు, విద్యుత్, మున్సిపాలిటీలు, ఇతర విభాగాల సన్నాహాలను సమీక్షించారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రి, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫండి భేటీలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మెరుగైన ఏర్పాట్ల కోసం సూచనలు చేశారు.

సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, వక్ఫ్ బోర్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షానవాజ్ ఖాసిం, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సభ్యుడు హనీఫ్ అలీ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు డాక్టర్ నిసార్ అఘా, వివిధ షియా సంస్థల నాయకులు, ఇతరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి నాగమల్లు ఆర్థిక సహాయం

హైదరాబాద్ , ఆగష్టు 2ప్రజల కోసం పోలీసులు పడే శ్రమ, ఒత్తిడి గురించి చాలామందికి మాత్రమే తెలుసు. కొంతమంది పోలీసులు ఆపదలో ఉన్నవారిని ఆదుకోడానికి తమ ప్రాణాలను సైతం ఫణంగా పెడతారు. ప్రజల శ్రేయస్సు, సమాజం కోసం పరితపిస్తుంటారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు ఈ కోవకు చెందినవారే. శాంతిభద్రతలను రక్షించడమే కాదు కష్టాల్లో వున్నవాళ్ళను ఆదుకుని మంచి తనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.గతంలో ఎంతో మందికి సాయం చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు మరోసారి మానవత్వం చాటుకున్నారు. నకిరేకల్ దగ్గర చందుపట్ల గ్రామానికి చెందిన సైదులు(25) అనే యువకుడు ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి తన రెండుకాళ్ళు తీసివేయాల్సి వచ్చింది. అయితే, ఆపరేషన్ కోసం డబ్బులు లేక తన వృద్ధ తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయితే, ఈ వార్తను వాట్సాప్ ద్వారా తెలుసుకున్న ఎల్బీనగర్ ట్రాఫిక్ అదనపు ఇన్స్పెక్టర్ అంజపంల్లి నాగమల్లు వెంటనే సైదులు అడ్మిట్ అయిన ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి అతడికి ధైర్యం చెప్పారు. తోటివారికి కష్ట సమయాల్లో సహకారం అందించాలనే ఉన్నత అధికారుల మాటలే తనకు సహాయం చేయడానికి స్ఫూర్తిని ఇచ్చాయని ఇన్స్పెక్టర్ అంజపంల్లి నాగమల్లు తెలిపారు.

వ్యాక్సిన్ తీసుకున్న వారికే మాల్స్‌లో ఎంట్రీ!

హైదరాబాద్ , ఆగష్టు 2తెలంగాణలో కరోనా కేసులు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. గాంధీ సహా వివిధ ఆస్పత్రుల్లో కోవిడ్ బాధితులు రోజురోజుకి పెరుగుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా వ్యాక్సిన్ తీసున్నవారిని మాత్రమే బహిరంగ ప్రదేశాలల్లో అనుమతించాలని నిర్ణయించారు. టీకా వేసిన వ్యక్తులకు మాత్రమే మాల్స్, సినిమా థియేటర్లు, రెస్టారెంట్లు వంటి బహిరంగ ప్రదేశాలల్లో అనుమతించాలని తెలంగాణ ప్రజారోగ్య డైరెక్టర్ జి శ్రీనివాసరావు సూచించారు. ఇందుకోసం రాష్ట్రంలో వ్యాక్సిన్ పాస్‌ను ప్రవేశపెట్టవచ్చని తెలిపారు.

థర్డ్ వేవ్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు కోవిడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. రాబోయే రోజుల్లో, మాల్స్, రెస్టారెంట్లు, సినిమా థియేటర్ల వంటి ఇతర వాణిజ్య సంస్థలను సందర్శించే వ్యక్తులకు టీకా వేసుకుంటేనే అనుమతి ఉంటుందని వివరించారు. ఇప్పటికే పలు దేశాలు ఈ విధంగా చర్యలు తీసుకున్నాయని పేర్కొన్నారు. తాము కూడా అలాంటి కఠినమైన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కరోనా కేసులు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. థర్డ్ వేవ్ రాకుండా ప్రజలు తప్పనిసరిగా స్వీయ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రభుత్వం కోవిడ్ ఆంక్షలను ఎత్తివేసిందని, ప్రజలు ఇంట్లో ఉన్నా బయటకి వెళ్లినా మాస్కులు ధరించాలని సూచించారు.

సిద్దిపేటలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రులు

సిద్దిపేట, ఆగష్టు 2: జిల్లా కేంద్రమైన సిద్ధిపేట శివమ్స్ గార్డెన్స్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ సిద్ధిపేట వారి సౌజన్యంతో మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సోమవారం మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రజల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రశంసనీయమన్నారు. ఇతర క్లబ్‌లకు లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని పిలుపునిచ్చారు.

వైభవంగా ముగిసిన శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు

--మూడవ రోజు అమ్మవారికి పుష్పాభిషేకం,భక్తులకు అన్నదానం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ముగిశాయి.ఈ సందర్భంగా ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు.పండగ పురస్కరించుకుని అమ్మవారికి ఇష్టమైన బోనాలను దప్పు సప్పుళ్ల మధ్య మహిళలు భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.చివరి రోజు అమ్మవారికి పుష్పాభిషేకం,భక్తులకు అన్నదానం నిర్వహించి వేడుకలను ముగించారు.ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.తమ పిల్లపాపలను చల్లగా కాపాడాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు.కరోనా కారణంగా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఈ సంవత్సరం పట్టణంలో అమ్మవారి ఊరేగింపు,పోతరాజుల నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిలిపివేశారు.అనంతరం అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు,ఆశీర్వాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్ గౌడ్,టిఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పుల్కం రాజు,నాయకులు కందుల క్రాంతి కుమార్,పులి రాంబాబు,ముప్పిడి శ్రీధర్, ముంజ ఉమెందర్,చిక్కుడు మల్లేషం,సాయిని అనిల్ కుమార్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

దళిత బంధు కొత్త పథకం కాదు : వినోద్ కుమార్

హైదరాబాద్ , ఆగష్టు 2రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'దళిత బంధు' పథకం ఆరు నెలల క్రితమే రూపుదిద్దుకున్నదని, ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రకటించారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం రవీంద్రభారతిలో సాంస్కృతిక సారథి కళాకారుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ గత కొంత కాలంగా వ్యూహ రచన చేస్తున్నారని అన్నారు. దళితుల విస్తృత ఆర్థిక, సామాజిక ప్రయోజనం కోసం సీఎం కేసీఆర్ పరితపించి దళిత బంధు పథకాన్ని రూపకల్పన చేశారని ఆయన గుర్తు చేశారు.

గత ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దళిత ఎంపవర్మెంట్ కోసం రూ. 1,000 కోట్లు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించినట్లే అన్ని రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో దళితుల అభ్యున్నతి కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారని ఆయన గుర్తు చేశారు.

కొత్తగా పుట్టుకొచ్చిన పథకం కాదు ఇది. అందునా రాజకీయ కోణం ఇందులో ఏమీ లేదు. కేవలం దళితుల అభ్యున్నతిని కాంక్షించే ఈ పథకాన్ని రూపకల్పన చేసినట్లు వినోద్ కుమార్ వివరించారు.

అయితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత కొవిడ్ మహమ్మారి ప్రభావం చూపడం వల్ల ఈ పథకం అమలులో జాప్యం జరిగిందని ఆయన తెలిపారు.

రైతు బంధు పథకాన్ని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో లాంఛనంగా ప్రారంభించినట్లే.. దళిత బంధు పథకాన్ని కూడా హుజురాబాద్ నుంచే ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని తీసుకున్నారని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

ఇందులో ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేదని , వాస్తవాలను ప్రతి ఒక్కరూ గమనించి మెలగాలని ఆయన సూచించారు.

తెలంగాణ ఉద్యమంలో కళాకారులు పోషించిన పాత్ర మరిచిపోలేదని, స్వరాష్ట్రం సిద్ధించగానే సాంస్కృతిక సారథి సంస్థ ద్వారా కళాకారులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు.

రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించిన పి.వి.సింధు

--కాంస్య పతక పోరులో సింధు 21-13 మరియు 21-15 తేడాతో చైనాకు చెందిన హి బింగ్ జియావోను ఓడించారు.
-రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్‌కోవిద్ మరియు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సింధు అద్భుతమైన ప్రదర్శనకు అభినందనలు తెలిపారు
-సింధును అభినందిస్తూ క్రీడా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మీరు చరిత్ర సృష్టించారు అని చెప్పారు.

టోక్యో, ఆగష్టు 2టోక్యో ఒలింపిక్స్‌లో మహిళల సింగిల్ మ్యాచ్‌లో భారత షట్లర్ పివి సింధు కాంస్య పతకాన్ని సాధించారు. పివి సింధు కాంస్య పతకం మ్యాచ్‌లో 21-13 మరియు 21-15 తేడాతో చైనాకు చెందిన హి బింగ్ జియావోను ఓడించి, రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచారు. సింధు రియో 2016 లో రజతం సాధించారు. రెజ్లర్ సుశీల్ కుమార్ రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన మొదటి మరియు ఏకైక భారతీయుడిగా నిలిచారు. పివి సింధు విజయం సాధించినందుకు రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్ కోవింద్, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, క్రీడా మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ మరియు దేశం నలుమూలల నుండి భారతీయులు అభినందించారు.

సింధు విజయం సాధించినందుకు రాష్ట్రపతి శ్రీ రామ్ నాథ్ కోవింద్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకోవింద్ ట్వీట్ చేస్తూ " పివి సింధు రెండు ఒలింపిక్ ఆటలలో పతకాలు సాధించిన మొదటి భారతీయ మహిళగా నిలిచారు. ఆమె స్థిరత్వం, అంకితభావం మరియు శ్రేష్ఠతకు కొత్త కొలమానంగా నిలిచింది. భారతదేశానికి కీర్తి తెచ్చినందుకు ఆమెకు నా హృదయపూర్వక అభినందనలు. " అని తెలిపారు.

సింధు ఆటకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. శ్రీ నరేంద్ర మోదీ ట్వీట్ చేస్తూ, " ఏఖలబతినిటఫ్టబీ1 యొక్క అద్భుతమైన ప్రదర్శనతో మేమంతా ఉల్లాసంగా ఉన్నాము. ఏటోక్యో 2020 లో కాంస్య పతకం సాధించినందుకు ఆమెకు అభినందనలు. ఆమె భారతదేశానికి గర్వకారణం మరియు మా అత్యుత్తమ ఒలింపియన్లలో ఒకరు." అని చెప్పారు.పివి సింధును అభినందిస్తూ, క్రీడా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ట్వీట్ చేస్తూ, "" స్మాషింగ్ విక్టర్ పివి సింధు !!! మీరు గేమ్‌పై ఆధిపత్యం చెలాయించి చరిత్ర సృష్టించారు ఎటోక్యో 2020! ఒలింపిక్ పతక విజేత రెండుసార్లు! భారతదేశం మీ గురించి చాలా గర్వంగా ఉంది ఉ మీ రాక కోసం వేచి ఉంది! మీరు సాధించారు !" అని చెప్పారు.పివి సింధు సిల్వర్ మెడలిస్ట్ (రియో 2016 ఒలింపిక్స్). ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులు. ఆమె తండ్రి అర్జున అవార్డు గ్రహీత. ఆమె 8 సంవత్సరాల వయస్సులో మెహబూబ్ అలీ మార్గదర్శకత్వంలో బ్యాడ్మింటన్ ఆడటం ప్రారంభించారు. మరియు సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ మరియు టెలికమ్యూనికేషన్స్ బ్యాడ్మింటన్ కోర్టులలో బ్యాడ్మింటన్ బేసిక్స్ ను నేర్చుకున్నారు. ఆట నేర్చుకోవడానికి మరియు ప్రాక్టీస్ చేయడానికి ఆమె తన నివాసం నుండి బ్యాడ్మింటన్ కోర్టులకు ప్రతిరోజూ 56 కిలోమీటర్ల దూరం ప్రయాణించేవారు. ఆమె పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేరారు. 10 సంవత్సరాల కేటగిరీలో అనేక టైటిల్స్ గెలుచుకున్నారు.

భారత హాకీకి ఒడిశా అండ.. స్పాన్సర్‌షిప్‌తో పతకాల వేట!

టోక్యో, ఆగష్టు 2ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడం అంటే ఏ దేశానికైనా గర్వకారణమైన విషయం. బంగారు పతకం సాధించడం ఓ అద్భుత అనుభూతి. టోక్యో ఒలింపిక్స్ లో భారత హకీ జట్టు దూకుడు కొనసాగుతోంది. 41 సంవత్సరాల తరువాత ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో అడుగు పెట్టిన మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని హాకీ ఇండియా.. ప్రత్యర్థి గ్రేట్ బ్రిటన్ ను ఓడించి సెమిస్ లోకి అడుగుపెట్టింది.

ఒడిశా సర్కారు జాతీయ క్రీడ హాకీకి అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. గత ఐదేళ్లుగా ఒడిశా ప్రభుత్వం భారత పురుషుల, మహిళల హాకీ జట్లకు స్పాన్సర్‌షిప్ అందించింది. భారత క్రీడల చరిత్రలో ఓ రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. 2014 చాంపియన్‌స ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చిన భువనేశ్వర్‌లో 2018 నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు ప్రపంచ కప్ టోర్నీ జరిగింది. ఈ సందర్భంలోనే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పాన్సర్‌షిప్ కు సంబంధించిన విషయాన్ని ప్రకటించారు.

హాకీలో ఎంతో ఘన చరిత్ర ఉన్న భారత్ గత కొద్ది ఏళ్లుగా నత్తా చాటలేకపోతోంది. కానీ, మన్ ప్రీత్ సారథ్యంలో యంగ్ కుర్రాళ్లు సత్తా చాటుతున్నారు. ఇదే దూకుడు కంటిన్యూ చేస్తే భారత్ కు మరో పతకం ఖాయం. సెమిఫైనల్ లో టీమిండియా బెల్జియంతో తలపడనుంది. భారత మహిళల హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ విజయం సాధించింది. ఒలంపిక్స్ లో పట్టిష్టమైన కంగారూలను భారత మహిళ టీమ్ చిత్తు చేసింది. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో సెమీఫైనల్ చేరి మహిళల హాకీ జట్టు సత్తా చాటింది. మూడుసార్లు ఒలింపిక్స్ లో విజేత అయిన ఆస్ట్రేలియాను 1-0 తేడాతో మట్టికరిపించింది. 1980 మాస్కో ఒలిపిం క్స్ తర్వాత భారత్ హాకీ జట్టు అత్యుత్తమైన ప్రదర్శన చేసి?తొలిసారిగా ఒలంపిక్స్?లో సెమిస్ చేరుకుంది. భారత మహిళల హాకీ జట్టు ప్రదర్శన అందరిని కట్టిపడేసింది.

కాగా, 2016 రియో ఒలింపిక్స్‌లోనూ భారత జట్టు క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. భారత పురుషుల హాకీ జట్టు చివరిసారి 1980 మాస్కో ఒలింపిక్స్ లో స్వర్ణ పతకం సాధించింది. ఆ తర్వాత ఎనిమిదిసార్లు ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్నా టీమిండియా ఒక్కసారీ కూడా సెమీఫైనల్ దశకు అర్హత సాధించలేకపోయింది. ఈసారి ఒలంపిక్స్ లో బంగారు పతకం కోసం గెలుపే లక్ష్యంగా పురుషులు, మహిళల జట్లు కృషి చేస్తున్నాయి.

నేదునూరు హత్యకేసులో 16 మంది నిందితుల అరెస్ట్

నిందితులు గతంలో జైలుజీవితం గడిపినా ప్రవర్తనలో మార్పు చెందలేదు

కరీంనగర్ ఆగష్టు 2 (నేటినిజం ప్రతినిధి): తిమ్మాపూర్ మండలం నేదునూరులో జరిగిన డ్రైవర్ హత్యకేసులో పోలీసులు 16మంది నిందితులను సోమవారం నాడు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన నిందితులు 05 కాగా మరో 11 మంది ఉన్నారు. ప్రధాన నిందితుల్లో 04గురు నేరచరిత్ర ఉన్నవారే వారంతా నేర ప్రవృత్తి కలిగి జైలుజీవితం గడిపివచ్చినవారే. ఈ నేదునూరు డ్రైవర్ హత్య సంఘటన ఇలా ఉన్నాయి.

జూలై 29న నేదునూరులో డ్రైవర్ నిశాని తిరుపతి(42) దారుణహత్యకు గురైన విషయం విదితమే. ప్రస్తుతం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో నివాసం ఉంటున్న నేదునూరు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు గోద సురేందర్ (45)మిగతా నిందితులతో కలిసి కోరుట్లకు చెందిన విత్తనాల నాగరాజు(37)తో ఈ హత్య చేయించేందుకు 04నాలుగు నెలల క్రితమే 1.5లక్షల రూపాయలు ఒప్పందం కుదుర్చుకుని ముందుగా ఒకలక్షరూపాయలు అందజేశారు. హత్య అనంతరం మిగిలిని 50వేలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ హత్యకు దారితీసిన కారణాలు ఈ విధంగా ఉన్నాయి.

భూ నిర్వాసితుల నష్టపరిహారం హత్యకు దారితీసింది

నేదునూరు గ్రామానికి చెందిన 475మంది భూములు ఎస్ఆర్ఎస్పి(ఎల్‌యండి డ్యాం) నిర్మాణంలో ముంపునకు గురయ్యాయి. వీరందరూ ప్రస్తుతం కరీంనగర్‌లో ఉంటున్న అదేగ్రామానికి చెందిన న్యాయవాదిని నష్టపరిహారంకోసం ఆశ్రయించారు. సదరు న్యాయవాది భాదితులకు నష్టపరిహారం అందించేందుకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఎస్ఆర్ఎస్పి అధికారులు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా భూములను కోల్పోయిన భాదితులకు అనుకూలంగానే న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎస్ఆర్ఎస్పి అధికారులు భాదితులకు నష్టపరిహారం అందించేందుకు 2015లో 12కోట్లరూపాయలను న్యాయస్థానంలో డిపాజిట్ చేశారు.

నష్టపరిహారం అందకపోవడానికి తిరుపతి అడ్డుగా నిలుస్తున్నాడని

భాదితుల తరపున న్యాయవాది వద్ద హత్యకు గురైన నిశాని తిరుపతి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 200 మంది భాదితులకు నష్టపరిహారం అందింది. మిగతా వారికి నష్టపరిహారం అందే విషయంలో హత్యకు గురైన డ్రైవర్ తిరుపతి అడ్డుగా నిలుస్తున్నాడని భావించి తిరుపతి సూచించిన వారికే న్యాయవాది డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటున్నాడని ప్రధాన నిందితుడైన గోద సురేందర్, మరో నిందితుడు ఒంటెల వెంకటరెడ్డి(63) అనుచరురు మధ్యవర్తిగా ఉండి, ఈ న్యాయవాదిని తప్పించి, మరోక న్యాయవాదిని ఏర్పరుచుకుని మిగిలిన లబ్ధిదారులకు పరిహారం ఇప్పించి ఇందుకుగాను కమిషన్ ఎక్కువ మొత్తంలో తీసుకుందామని నిర్ణయించుకున్నారు. ఎలాగైనా తిరుపతిని అడ్డుతొలగించాలని నిర్ణయించుకున్నారు.

కిడ్నాప్ చేసి కారులో ఎత్తుకెళ్ళాన విధానం

జూలై 29న రాత్రి నిశాని తిరుపతిని గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లిలో ఒకకిరాణం దుకాణం వద్ద ఉండగా ప్రధాన నిందితులు గోద సురేందర్(45), జగిత్యాల జిల్లా మల్లాపూర్‌కు చెందిన పిల్లి సత్యనారాయణ(36), కోరుట్లకు చెందిన విత్తనాల నాగరాజు(37), విత్తనాల త్రిమూర్తి అలియాస్ మూర్తి ప్రస్తుతం కొత్తపల్లి మండలం చింతకుంటలో నివాసం ఉంటున్న పెద్దపల్లి ప్రాంతానికి చెందిన కోల చందర్‌రావు(49) కారులో వచ్చి కిడ్నాప్‌చేసి నేదునూరు గ్రామశివారులోని చెట్లపొదల్లో గొడ్డళ్ళతో నరికి చంపారు. ప్రధాన నిందితుల్లో ఒకరైన కోల చందర్‌రావుకు నాగరాజు స్నేహితుడు, ఇద్దరికి జైల్లో స్నేహం ఏర్పడింది. కోల చందర్‌రావు గతంలో ఒకహత్యకేసులో నిందితుడు. నాగరాజు జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్యాయత్నం కేసులో నిందితులు. ప్రధాన నిందితుల్లో ఒకరైన పిల్లి సత్యనారాయణ, విత్తనాల త్రిమూర్తి సిద్దిపేట చిన్నకోడూరులో జరిగిన ఒక హత్యకేసులోకూడా నిందితులు. పైన పేర్కొన్న ప్రధాన నిందితులంతాకూడా నేరచరిత కలిగినవారే.

మరో 11మంది నిందితుల వివరాలు

ఈ హత్యకు సహకరించిన మరో 11 మంది నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. నేదునూరు గ్రామానికి చెందిన గోద శ్రీనివాస్(44), గోద నరేందర్(46), జన్నవరపు రాజయ్య(68), నేదునూరి ఎల్లయ్య(59), నేదునూరి గంగరాజు(45), గోద ప్రవీణ్(33), పొందుర్తి తిరుపతి(40), కాల్వ సంపత్(40), ఒంటెల గణపతిరెడ్డి(38), ఒంటెల వెంకటరెడ్డి(63), దాడి కొమురయ్య(43)లు ఉన్నారు.

నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు, వాహనాలు

నిందితుల వద్ద నుండి ఏపి 15 ఏఎస్ 4262 నెంబర్‌గల ఐ10కారు, టిఎస్ 21 ఏ4575 టాటా జెస్ట్, పల్సర్ ద్విచక్ర వాహనం, ఒక గొడ్డలి, హత్యచేసిన సందర్భంలో రక్తమరకలు అంటిన దుస్తులు, 11సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

హత్యకేసు ఛేదనకు ప్రత్యేక బృందాల ఏర్పాటు

సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ ఏసిపి విజయసారధి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపులను కొనసాగించారు. సంఘటనాస్థలంలో లభించిన ఆధారాలతోపాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం జరిగింది.

ఈ హత్యకేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన తిమ్మాపూర్ సిఐ శశిధర్‌రెడ్డి, ఎల్‌యండి ఎస్ఐ పి ప్రమోద్‌రెడ్డి, గన్నేరువరం ఎస్ఐ ఆవుల తిరుపతిలతోపాటు పలువురు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అభినందించడంతోపాటు రివార్డులను ప్రకటించారు.

జుట్టు సంరక్షణ కోసం శాఖాహార కెరటిన్ ఉత్పత్తులను పరిచయం చేసిన అతుల్య

హైదరాబాద్ , ఆగష్టు 2 విస్తృతశ్రేణిలో మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను పరిచయం చేయడంలో భాగంగా బీకాన్ బయో లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన సుప్రసిద్ధ బ్రాండ్ అతుల్య తమ నూతన వెజ్ కెరటిన్ మరియు వీట్ ప్రొటీన్ శ్రేణి ఉత్పత్తులను విడుదల చేసింది. వీటి లో హెయిర్ షాంపూ, హెయిర్ కండీషనర్, హెయిర్‌ఆయిల్, హెయిర్ మాస్క్ ఉన్నాయి. జంతువుల కెరటిన్‌కు ప్రత్యామ్నాయంగా పూర్తిగా కూరగాయలతో తయారుచేసిన శాఖాహార కెరటిన్‌తో రూపుదిద్దిన హెయిర్ కేర్ ఉత్పత్తి శ్రేణిని భారతదేశంలో మొట్టమొదటిసారిగా అతుల్య పరిచయం చేసింది. ఈ నూతన ఉత్పత్తి శ్రేణితో పాటుగా స్విచ్ టు వెజ్ కెరటిన్ శీర్షికన ఓ ప్రచారం సైతం అతుల్య నిర్వహిస్తూ వెజ్ కెరటిన్ వినియోగం, దాని ప్రయోజనాలను గురించి కూడా చెబుతుంది. అతుల్య ఈఉత్పత్తులన్నీ కూడా మొక్కలు మరియు వెజ్ కెరటిన్ నుంచి తయారుచేసింది. ఈ ఉత్పత్తులన్నీ పూర్తిగా జుట్టు సంరక్షణ కోసం ఎలాంటి రసాయనాలూ వినియోగించకుండా భారతదేశంలో తయారుచేశారు. జంతువుల కెరటిన్‌తో తయారుచేసిన ఉత్పత్తుల్లా కాకుండా అతుల్య కెరటిన్ వీట్ ప్రొటీన్ శ్రేణి ఉత్పత్తులన్నీ కూడా పారాబెన్స్ సల్ఫైట్ రహితంగా ఉంటాయి.బీకాన్ బయోలైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గౌరవ్ సింగ్ మాట్లాడుతూ "మేము జుట్టు సంరక్షణ కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వెజ్ కెరటిన్ ఉత్పత్తులతో వచ్చాము. వెగాన్ జీవనశైలిని అనుసరించేలా ప్రజలను ఇది ప్రోత్సహిస్తుంది. ఇటీవలి కాలంలో అధికశాతం మంది క్రూరత్వం లేని, సహజసిద్ధమైన, రసాయనాలు లేని ఉత్పత్తులను కోరుకుంటున్నారు. అందువల్ల, మేము ఈ ప్రత్యేక శ్రేణి ఉత్పత్తులను వెజ్ కెరటిన్‌తో తయారుచేసి అందిస్తున్నాం. జుట్టు పాడవకుండా కాపాడటంతో పాటుగా జుట్టు చిట్లకుండా అడ్డుకునే ప్రొటీన్‌ను సైతం కాపాడుతుంది. వినియోగదారులకు ఈ అంశాల పట్ల అవగాహన కల్పించడానికి స్విచ్ టు వెజ్ కెరటిన్ ప్రచారమూ ఆరంభించాం.

తెలంగాణకు రూ.38,114 కోట్ల 'ముద్ర' రుణాలు

హైదరాబాద్ , ఆగష్టు 2ప్రధాన మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.38,114 కోట్ల రుణాలు మంజూరు చేశామని కేంద్రం వెల్లడించింది. ఆ మొత్తం 47,26,819 ఖాతాల్లోకి బదిలీ అయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరాడ్ తెలిపారు. పీఎంఎంవైలో భాగంగా శిశు, కిషోర్ మరియు తరుణ్ పథకాల కింద తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటి వరకు ఎన్ని ముద్ర నిధులు మంజూరయ్యాయి...? కేటగిరీల వారీగా పథకం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలు, ఈ విషయంలో వచ్చిన ఫిర్యాదులు, ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం పార్లమెంట్ లో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరాడ్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.

2015 ఏప్రిల్ లో ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం ప్రారంభమైందని, నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా రూ. 15.52 లక్షల కోట్ల రుణాలు మంజూరయ్యాయన్నారు. ఇక తెలంగాణ విషయానికొస్తే.... ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు గత ఆరేళ్లలో మొత్తం 47,26,819 మంది ఖాతాలకు రూ.38,114 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో 37,46,740 మంది రూ.50 వేలలోపు (శిశు పథకం) రుణాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.5 లక్షల లోపు (కిషోర్ పథకం) రుణాలు తీసుకున్న వారు 7,94,193 మంది, రూ.10 లక్షలలోపు (తరుణ్ పథకం) రుణాలు తీసుకున్న వారి సంఖ్య 1,85886 మంది ఉన్నట్లు వివరించారు.

వ్యవసాయ, వాణిజ్య, ఉత్పత్తి, సేవల రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద వేలాది కోట్ల రుణాలను మంజూరు చేసి లక్షలాది మందికి లబ్ధి చేకూరుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం కేంద్రం నుండి ఎలాంటి సాయం అందడం లేదంటూ పచ్చి అబద్దాలు వల్లిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుండటం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందనడానికి గత ఏడేళ్లుగా రాష్ట్రానికి వివిధ రంగాల్లో కేటాయించిన నిధులు, మంజూరు చేసిన రుణాలే నిదర్శనమని బండి తెలిపారు.

ఆలయ ఉద్యోగి కుటుంబాన్ని పరామర్శించిన ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2:(నేటినిజం ప్రతినిధి): రాజన్న ఆలయ ఉద్యోగి సగ్గు దేవరాజు గుండెపోటుతో చనిపోగా అతని కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు . ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి , జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్ , మాజీ ధర్మకర్త సగ్గు పద్మ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ , తదితరులు ఉన్నారు ,

ఇనార్బిట్ మాల్‌లో ఫ్లాట్ 50శాతం అమ్మకాలతో 'అన్‌బాక్స్ యువర్ హ్యాపీనెస్'

సీజన్ అమ్మకం 15 ఆగష్టు 2021 వరకు

హైదరాబాద్ , ఆగష్టు 2 ఈ సంవత్సరం 'అన్‌బాక్సింగ్ హ్యాపీనెస్' అని పిలువబడే ఇనార్బిట్, హైదరాబాద్ ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ వినియోగదారుల ముఖాల్లో చిరునవ్వు తెస్తుంది. 70% వరకు తగ్గింపు మరియు ఫ్లాట్ 50 విక్రయాలు జరుగుతున్నాయి. వినియోగదారులను సంతోషపరిచే విధంగా చౌక ధరలను ప్రకటించింది ఇనార్బిట్ మాల్. ఉత్తమ లైఫ్‌స్టైల్ బ్రాండ్‌లు అద్భుతమైన ఆఫర్లను కలిగి ఉన్నాయి. మార్క్స్ ఆ స్పెన్సర్, లైఫ్‌స్టైల్, షాపర్స్ స్టాప్, బాత్ ఆ బాడీ వర్క్స్, అల్డో, డా మిలానో, అమెరికన్ ఈగిల్ మరియు బీబా వంటి బ్రాండ్‌లు దుస్తులు, పాదరక్షలు, కిడ్స్ వేర్ వంటివి 50% తగ్గింపును అందిస్తున్నాయి. సేల్ 1 ఆగస్టు 2021 వరకు ఉంటుంది. కాల్విన్ క్లైన్, చార్లెస్ ఆ కీత్, వెరో మోడా, నైక్, ప్యూమా, జాక్ జోన్స్, లెవిస్, సూపర్‌డ్రీ వంటి మీకు ఇష్టమైన బ్రాండ్‌లు 'అన్‌బాక్సింగ్ ఆఫ్ హ్యాపీనెస్ థీమ్డ్ ఎండ్' సందర్భంగా తమ కలెక్షన్లలో అద్భుతమైన సేల్స్ ఆఫర్‌లతో మిమ్మల్ని పలకరించడానికి మరింత సంతోషిస్తున్నాయి. సీజన్ అమ్మకం 15 ఆగష్టు 2021 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. , దుకాణదారులు తమ అభిమాన షాపింగ్ గమ్యస్థానాన్ని సందర్శించడానికి మరిన్ని కారణాలను అందిస్తుంది. మాల్ ఆ ఉత్తమ షాప్‌హోలిక్ ఇన్‌స్టా సెల్ఫీల కోసం 'అన్‌బాక్సింగ్ హ్యాపీనెస్' యొక్క సంస్థాపనను కూడా ఏర్పాటు చేసింది. ఆఫర్‌లతో పాటు, సందర్శించే ప్రతిఒక్కరికీ మాల్ అథారిటీ సురక్షితమైన సంతోషకరమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది. పూర్తిగా టీకాలు వేసిన రిటైల్ భాగస్వాములు, సేవా సిబ్బంది నుండి సాధారణ టచ్ పాయింట్లను క్రమం తప్పకుండా పరిశుభ్రత చేయడం వరకు, మాల్ అధికార యంత్రాంగం ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టారని అన్నారు. వ హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ వివిధ ప్రదేశాలలో డైసన్ ఎయిర్ ప్యూరిఫైయర్‌లను కూడా ఏర్పాటు చేసింది, తద్వారా ప్రజలు ఊపిరి పీల్చుకోవచ్చు. ఆఫర్లు మరియు అమ్మకాలను నిరాకరించడం కష్టం, కొన్ని విఘాతం లేని సరదా అనుభవం కోసం నడుచుకోండి.

లయన్స్ క్లబ్ కోశాధికారి రాజశేఖర్ జన్మదిన సందర్భంగా అన్నదానం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వేములవాడ లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ ఎడ వె ల్లి రాజశేఖర్ జన్మదినంసందర్భంగా పట్టణంలోని ఆలయ పరిసర ప్రాంతంలోని యాచకులకు పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ రాజశేఖర్ నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని వేడుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

కరోనా రాకుండా అప్రమత్తంగా ఉండాలి -స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంచార్జీ ప్రవళిక

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల మల్యాల గ్రామంలో జిల్లా రాహు ల్ హెర్జే ఆదేశానుసారం ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు కళాబృందం ఇంచార్జీ జి . సతీష్ చరణ్ బృందం కరోనాపై అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం వారు కరోనా వైరస్ ప్రమాదంపై పాటల రూపకంలో ప్రజలకు వివరించారు . ఈ కార్యక్రమానికి హాజరైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంచార్జీ ఎస్సై ప్రవళిక మాట్లాడుతూ ప్రజలు కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తప్పకుండా బౌతిక దూరం పాటిస్తూ మస్కులు తప్పనిసరిగా ధరించాలని అన్నారు . ప్రభుత్వం లాక్ డౌన్ ఎత్తేసిన తర్వాత ప్రజలు అజాగ్రత్తగా ఉంటున్నారని తర్డ్వేవ్ ముప్పు ఉందని ప్రజలు గ్రహించాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఎఎస్సై బాబు, జిల్లా పోలీసుల బృందం సభ్యులు పాల్గొన్నారు .

పుస్తక పఠనం సామాజిక చైతన్యానికి మార్గం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 2:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ప్రాంత నివాసుడైన సీనియర్ సివిల్ జడ్జి గజావాడ వేణువేములవాడ న్యాయవాద అసోసియేషన్ కు కొన్ని విలువైన పుస్తకాలను ప్రదానం చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదువుతూ మంచి పరిజ్ఞానం పెంచుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుడిసె సదానందం ,గ్రందలయ కార్యదర్శి సంటి సుజివన్ దివాకర్ ,నాగుల సత్యనారాయణ, చెర్ల ఆనంద్ కుమార్ ,రేగుల దేవేందర్ ,కొడిమ్యాల పురుషోత్తం ,అంజయ్య ,కొత్తబండా నర్సింగరావు ,పరలపల్లి అంజయ్య ,తదితరులు పాల్గొన్నారు

ఇంటి నుంచే పని చేస్తామంటున్న ఉద్యోగులు: సర్వే

న్యూఢిల్లీ, ఆగష్టు 2: వర్క్ ఫ్రమ్ హోమ్ (చినీతీ్ని ఈతీ్నీఏ ఊనీఏవ).. చాన్సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీలకే పరిమితమైన ఈ ఆప్షన్.. కరోనా కారణంగా చిన్నచిన్న కంపెనీలకూ పాకింది. పని జరిగితే చాలు ఎక్కడైతే ఏంటి అనుకునే కంపెనీలు సాధ్యమైనంత వరకూ తమ ఉద్యోగులకు ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ ఆప్షన్ ఇచ్చాయి. అయితే మెల్లమెల్లగా కేసులు తగ్గుముఖం పట్టడం, సెకండ్ వేవ్ వెళ్లిపోవడంతో చాలా సంస్థలు మళ్లీ తమ ఆఫీసులను తెరుస్తున్నాయి. ఉద్యోగులను రమ్మంటున్నాయి. కానీ ఇంట్లో పని చేయడం అలవాటైన ఉద్యోగులు మాత్రం ఇలాగే కొనసాగితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. త